


గురువారం 06-11-2025 పేజీలు : 6

# తీరని శోకం

- రోడ్డు ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు మృతి
- మరొకరి పరిస్థితి విషమం.. శోకసంద్రంలో జగన్నాథ్‌పూర్
- పుణ్యక్షేత్రానికి వెళ్లి వస్తూ మృత్యుఒడికి
- కర్ణాటక దుర్ఘటన మిగిల్చిన విషాదమిది



5లో

## ఏడుపాయల్లో
# కార్తీక శోభ..

- కిక్కిరిసిన భక్తజనం
- వైభవంగా లక్ష దీపారాధన
- రమణీయంగా సాగిన వనదుర్గమ్మ పల్లకి సేవ
- వనదుర్గామాత సన్నిధిలో పోటెత్తిన భక్తజనం



6లో

# మొగులైతే.. గుబులు!

## కొనుగోలు కేంద్రాల్లో తడుస్తున్న ధాన్యం



6లో

- వాననీటికి కొట్టుకుపోతున్న వడ్లు
- పలు కేంద్రాల్లో మొలకలు వస్తున్న వైనం
- కన్నీరు మున్నీరవుతున్న రైతులు
- నత్తనడకన సాగుతున్న ధాన్యం సేకరణ
- రైతులను దోపిడీ చేస్తున్న నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు
- రైతులకు నష్టం చేస్తున్న అకాల వర్షాలు.. చేతికొచ్చిన వడ్లు వర్షార్పణం

## వర్షాలకు దెబ్బతిన్న
# బీటీ రోడ్లు..

- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- పట్టించుకోని అధికారులు



5లో



# ఊట్ల అయ్యప్ప ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

* కార్తీక పౌర్ణమి సందర్భంగా 20 జంటలతో ఘనంగా వ్రతాలు

పటాన్ చెరు/ప్రజాజ్యోతి : జిన్నారం మున్సిపల్ పరిధిలోని ఊట్ల అయ్యప్ప ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఊట్ల, దాదిగూడెం, రామ్‌నగర్ కాలనీల నుంచి వచ్చిన సుమారు 20 జంటలు వ్రతాలలో పాల్గొని శ్రీ సత్యనారాయణ స్వామి ఆశీస్సులు పొందారు. ఆలయ పరిసరాలు భక్తి వాతావరణంతో మార్మోగాయి. వ్రతాల అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శివరాజ్, ఆంజనేయులు, వెంకట్ రామ్‌రెడ్డి, గోవింద్‌రాజు, ఆధ్యాత్మికవేత్త జహంగీర్ రెడ్డి, వీరయ్య గురుస్వామి, జింకల శ్రీనివాస్, యాదగిరి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**అందోలు, నవంబర్05, (ప్రజాజ్యోతి):** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కన్సాన్ పల్లిలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా పిఎసిఎస్ నిర్వాహకులు నర్సింలు అన్నారు. బుధవారం ఆందోల్ మండలం లోని కన్సాన్ పల్లి గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని పిఎసిఎస్ సిబ్బంది నర్సింలు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్, మాజీ ఎంపిటిసి బాలయ్య లతో కలిసి ప్రారంభించారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని తేమ శాతం 17 వచ్చేవరకు ఆరబెట్టాలని, తాలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఇలా చేయడం ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కే రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవచ్చు అన్నారు. గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో రైతులు జాను, దర్శనం, దుర్గయ్య, రమేష్, మానయ్య, నర్సింలు, సాయిలు, అర్జున్, శంకర్, మల్లేశం, పోచయ్య, తదితర రైతులు పాల్గొన్నారు.

# జిల్లా లో నేటి వరకు 34,520 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

* కొనుగోలు లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి
* సన్న, దొడ్డు రకం పై అవగాహనా కలిగి ఉండాలి
* సంగాయి పేట కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**కొల్చారం (ప్రజాజ్యోతి) నవంబర్ 05:** జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోల్చారం మండల పరిధిలోని సంగాయిపేట గ్రామా పరిధిలో ఏర్పాటు చేసిన పిఎసిఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. జిల్లాలో ఇప్పటివరకు 34,520 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్దేశించిన రిజిస్టర్లు నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలించారు. అదేవిధంగా కలెక్టర్ స్వయంగా తేమ శాతాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చిన వెంటనే సీరియల్ నెంబర్ల వారీగా ఎంత దాన్యం తెచ్చారు, ధాన్యం తేమ తెచ్చిన రోజు ఎంత ఉంది అనే వివరాలు రిజిస్టర్లలో నమోదు చేసుకోవాలని తెలిపారు. నిర్దేశించిన తేమ శాతం వచ్చిన వెంటనే కేటాయించిన మిల్లుకు ధాన్యాన్ని వెంటనే లోడ్ చేసి పంపించేయాలని సూచించారు. ఇక వరి కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు సన్న రకం వరి ధాన్యాన్ని, దొడ్డు రకం వరి ధాన్యాన్ని గుర్తించడంలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గతంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన వారు మాత్రమే కొనుగోళ్ళ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమం లో మంజీరా రైతు సంఘం చైర్మన్ వెంకట్ రెడ్డి, డైరెక్టర్ లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# క్రీడల్లో పాల్గొనాలంటే ఆర్టీసీ తో పోటి పడాలి

* కరువైన బస్సు సౌకర్యం.
* మహాలక్ష్మి పతకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
* అధికారుల ఆదేశాలు.. ప్రిన్సిపాల్ సత్యకుమారి



కొల్చారం (ప్రజాజ్యోతి) నవంబర్ 05: క్రీడా పోటీలలో పాల్గొనాలంటే ముందు ఆర్టీసీ బస్సు ఎక్కి వెళ్లేందుకు పోటి పడాల్సి వస్తుందని విద్యార్థినీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్ర మైన కొల్చారం నుండి సాంఘిక సంక్షేమ ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థినిలు బుధవారం మెదక్ లో నిర్వహిస్తున్న ఆటల పోటీలలో పాల్గొనడానికి వెళ్లేందుకు మహాలక్ష్మి బస్సే దిక్కు అవుతుందని దింతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. గురుకుల పాఠశాల విద్యార్థినీలకు ఇంతకుముందు వివిధ పోటీల్లో వెళ్లేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి టీచర్ల సంరక్షణలో జాగ్రత్తగా వెళ్లి తీసుకోచ్చేవారు ఇటీవల ప్రభుత్వం నుండి నిధులు రాకపోవడంతో అందరికీ మహాలక్ష్మి ఫ్రీ బస్సు ఎలా వెళ్తున్నారు. మీరు కూడా ఆపతకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు రావడంతో ఒకేసారి 100 మంది విద్యార్థులు రావడంతో బస్సులు సమయానికి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందిగా ఫాలో అవుతున్నారు. 25 మందికి ఒక టీచర్ చొప్పున తరలిస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సత్యకుమారి తెలిపారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు ఇటీవల రాష్ట్రంలో ఎక్కడికక్కడ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అందరిలాగా మహాలక్ష్మి పథకంలో కాకుండా మెదక్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు విద్యార్థులకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని పలువురు కోరుకుంటున్నారు.

# జోగిపేట పార్వతీశ్వరాలయంలో కార్తీక దీపోత్సవం

అందోలు, నవంబర్05, (ప్రజాజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి స్థానిక పార్వతీశ్వరాలయం లో కార్తీక దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వివిధ ఆకృతులలో అలంకరించిన దీపాలు చూపరులను కట్టిపడేశాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టణ వాసులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు రవిప్రకాష్, సత్యవ్రత్, రాజేందర్, గున్నాల రమేష్, వీర్ సంగప్ప అరవింద్, శివ శంకు మరియు మహిళా సభ్యులు పాల్గొన్నారు.



# ఎర్రగడ్డ లో మైనం పల్లి ఇంటింటా ప్రచారం

* **నవీన్ యాదవ్ ను అత్యధిక మెజార్టీ తో గెలిపించండి**
* **జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం లో మైనం పల్లి ముమ్మర ప్రచారం**




**మెదక్ ప్రతినిధి (ప్రజాజ్యోతి) నవంబర్ 05:** జూబ్లీ హిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని ఎర్రగడ్డ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు,మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి లు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనం పల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రాబోయే ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించి ప్రజలు అదే నమ్మకాన్ని మరోసారి చాటాలని కోరారు.గత పది సంవత్సరాలుగా ఈ నియోజకవర్గం అభివృద్ధి అంధకారంలో నెట్టివేయబడిందని, ప్రజలు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని తెలిపారు. ఇప్పుడు ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఆ మార్పుకు ప్రతీకగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తక్కువ కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని, అందులో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని వారు వివరించారు.. జూబ్లీహిల్స్ ప్రజలు సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి దిశను విశ్వసించి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, "చేతి గుర్తుకు" ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మహిపాల్ రెడ్డి, సుధీర్ కుమార్ గౌడ్,కార్పొరేటర్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు స్థానిక ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొనారు.

# అనుమతి లేకుండా బోరుబావి తవ్వడం తో
# స్థానిక తాసిల్దార్ సహకారమే అంటున్న భూయజమాని

* **మీడియా పలు అధికారులకు ఫోన్ చేసిన లిఫ్ట్ చేయకుండా వి ఆర్ ఏ లను చూసుకోవాలని సూచించారని సమాచారం.**
* **మనోహరాబాద్ మండలంలో పనిచేస్తున్న అధికారులకు డబ్బుల మీద ఉన్న సోయి ప్రజల మీద లేదంటున్నారు పలువురు ప్రజలు**




మనోహరాబాద్. నవంబర్ 05 (ప్రజా జ్యోతి) మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కలకల్ జాతీయ రహదారి కానుకొని ప్రసాద్ హోమ్స్ వెంచర్ పక్కన మీరా దేవి దాబా ఎదురుగా తూప్రాన్ కు చెందిన ఓ వ్యక్తి ఇష్టారాజ్యంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి జలవనరుల అనుమతులు తీసుకోకుండా బోరుబావి తవ్వకాలు జరుగుతుంటే ఈ విషయంపై పలువురు అడగగా ఈ బోరు బావి విషయంలో ఎమ్మార్వో ను మజ్జిగ చేసుకున్నామని. మీడియాతో వెల్లడించాడు. బోరు బావి తవ్వుతున్న వెహికల్ నెంబర్ ట్స్ TS 30 D, 7218 గల బోర్ వెల్ వెహికల్ తో బోరు తవ్వకాలు జరిపాడు. ఈ విషయమై మీడియా నిలదీయగా ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ దురుసుగా మాట్లాడుతూ ఎమ్మార్వో ఆర్డీవోలు మా పట్ల అనుచరులుగా ఆయన వ్యాఖ్యానించారు. అయ్యా రెవెన్యూ అధికారుల్లారా ప్రజల పట్ల సిద్ధ శుద్ధి లేకపోతే ఉద్యోగాలు మానేసి ఇంట్లో పిల్లాపాపలతో ఎంజాయ్ చేయాలి.




కానీ ప్రజలతో చెలగాటమాడకుండా కమర్షియల్ దందాలతో డబ్బులు సంపాదించి మీరు ఎన్ని రోజులు బాగుపడాలని పలువురు ప్రజల ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు బోధన మొదలుకుంటే భూమ్మీద జరిగే దందాలన్నీ పైసా లేదే పని కాదని పలువురు రెవెన్యూ అధికారులపై దుమ్మెత్తి మనోహరాబాద్ అంటేనే మనీ అనే విధంగా పారిశ్రామిక ప్రాంతం ఉండటంతో కోట్లాది రూపాయల సంపాదించుకొని గుట్టు చప్పుడు కాకుండా వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏసీబీ అధికారులకు బుద్ధి జ్ఞానం ఉంటే మనోహరాబాద్ ప్రభుత్వ అధికారులపై చిత్తశుద్ధితో నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.




## దేదీప్యమానంగా
# కార్తీక పౌర్ణమి వేడుకలు

* **మల్లికార్జున స్వామి ఆలయంలో పోటెత్తిన భక్తులు**

వెల్దుర్తి, ప్రజాజ్యోతి, నవంబర్ 05 : వెల్దుర్తి మండలం బస్వాపూర్ గ్రామంలో శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రజలు పెద్ద ఎత్తున కార్తీక పౌర్ణమి వేడుకలను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వయంభుగా వెలసిన పుట్టు లింగానికి భక్తులు అభిషేకాలు చేసారు. సాయంత్రం వేళ మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాల వద్దకు చేరుకొని కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులు కుటుంబ సభ్యులతో ఆలయాలకు చేరుకోవడంతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి. దేవాలయం వద్ద



వెల్దుర్తి వాస్తవ్యుడు అయిన డాక్టర్ చిప్ప శ్రీనివాస్ ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ లోగో బ్యాగుల్లో
# రేషన్ బియ్యం పంపిణీ

* **హరిదాస్పూర్ మాజీ సర్పంచ్ నర్సింలు**

కొండాపూర్, ప్రజా జ్యోతి : మండల పరిధిలోని హరిదాస్పూర్ గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీకి కొత్త శైలి వచ్చింది. బుధవారం హరిదాస్పూర్ రేషన్ షాపులో నర్సింలు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా తయారు చేయించిన లోగో గల బ్యాగుల్లో బియ్యాన్ని లబ్ధిదారులకు అందజేశారు. ఈ పంపిణీ కార్య క్రమంలో మాజీ సర్పంచ్ నర్సింలు పాల్గొని బియ్యం పంపిణీని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తుందని తెలిపారు.

# వీరభద్రుని సన్నిధిలో ఆధ్యాత్మిక శోభ

* కనులు విందుగా ఆకాశ జ్యోతి
* దీపాలు వెలిగించిన మహిళా భక్తులు
* మిరమిట్లు గొలిపే దీపా కాంతులు





కొల్చారం (ప్రజాజ్యోతి ) నవంబర్ 05: కార్తీక పౌర్ణమి నాడు భక్తిశ్రద్ధతో వ్రతాలు, నోములు చేస్తే ఎంతో పుణ్యం కలుగుతుందని అలాగే కార్తీక మాసంలో నది స్నానం, దీపారాధన ఇవన్నీ కూడా విశేష ఫలితాలను తీసుకువస్తాయని ఆలయ కమిటీ అధ్యక్షులు ర్యాగల్ల ఆనంద్ స్పష్టం చేశారు. బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మండలకేంద్రంలోని వీరభద్ర ఆలయ ప్రాంగణంలో వెలిగించిన దీపాలు దీపావళి శోభను సంతరించుకుంది. గంగా నదిలో స్నానం చేస్తే సకల పాపాలు తొలగిపోతాయి, కోరిన కోరికలు కూడా నెరవేరుతాయని. కార్తీక పౌర్ణమి నాడు శివుడు త్రిపురాసురుడు అనే రాక్షసుడిని సంహరించాడు. దేవతలను ఆ రాక్షసుడి దురాగతాల నుంచి విముక్తి కల్పించాడు. దీంతో దేవతలందరూ సంతోషంతో శివుడికి దీపాలు వెలిగించారు. ఈ రోజున చేసే దీపారాధనకు ఎంతో విశిష్టత ఉందని ఆలయ పూజారులు సంగమేశ్వరప్ప యోగేశ్వరప్ప మహేశ్వరప్పలు తెలిపారు. దీపదానం చేస్తే ఎంతో పుణ్యం కలుగుతుందని అగ్నిపురాణంలో చెప్పబడిందన్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా చాలా మంది భక్తులు 365 వత్తులతో కూడిన దీపాన్ని వెలిగించారు. అలా 365 వత్తులు వెలిగించడం వలన సంవత్సరంలో ఏ ఒక్కరోజు దీపం వెలిగించకపోయినా కోల్పోయిన పుణ్యాన్ని తిరిగి పొందవచ్చు భక్తుల విశ్వాసం. కార్తీక పౌర్ణమి నాడు లక్ష్మీదేవిని ఆరాధిస్తే కూడా మంచి జరుగుతుందని నారాయణుడిని, శివుడిని కలిసి పూజిస్తే విశేష ఫలితాలను పొందవచ్చని నమ్మకంతో భక్తులు దీపాలను వెలిగించారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరంలాగానే కార్తీక మాసంలో వీరభద్ర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో దీపారాధన, ఆకాశదీపం వెలిగించారు. దీపాల కాంతులు వెలుగులీనుతుండగా మిరుమిట్లు గొలిపే వీరభద్ర ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ప్రత్యేక పూజా కార్యక్రమాలలో అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని. దీపారాధన కార్యక్రమం, ఆకాశ జ్యోతి దర్శనం చేసుకున్నారు.



## దేదీప్యమానంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

* రాంసాన్ పల్లి లో మహా అన్నదానం

అందోలు, నవంబర్05, (ప్రజాజ్యోతి): అందోలు పరిధిలోని పరిసర గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారం దేదీప్యమానంగా జరిగాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలను ఉదయంనుండే సుందరంగా అలంకరించి, సాయంకాలం ఆలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మహిళా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రాంసాన్ పల్లి గ్రామంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని స్థానిక శివాలయంలో కొలువైన శివ లింగానికి పంచామృత అభిషేకం, దీపారాధన, మహా అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ యువకులు ఆలయం వద్ద జరిగే అన్నదానానికి అవసరమైన ఏర్పాట్లలో పాల్గొని తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. సాయంకాలం యువకులు, మహిళలు, చిన్నారులు భారీగా ఆలయం వద్దకు తరలివచ్చి స్వస్తిక్, ఓం, త్రిశూలం, డమరుకం వంటి ఆకృతులలో దీపాలను పేర్చి వెలిగించగా ఆలయ ప్రాంగణం శోభాయమానంగా పరిఢవిల్లింది. అనంతరం భక్తులు శివయ్యను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా మండలంలోని ఆందోలు, జోగిపేట, రాంసాన్ పల్లి, మాసానిపల్లి, కన్సాన్ పల్లి తదితర గ్రామాల్లో కార్తీక పౌర్ణమి శోభ దేదీప్యమానంగా అలరారింది.

## నల్ల పోచమ్మ ఆలయంలో ఘనంగా దీపోత్సవం

* భారీగా హాజరైన భక్తులు
* భక్తిశ్రద్ధలతో పల్లకి సేవ
* హాజరైన సుహాసిని రెడ్డి ఆంజనేయులు గౌడ్, ప్రముఖులు




**కౌడిపల్లి, ప్రజా జ్యోతి నవంబర్ :** మండలంలో ప్రసిద్ధిగాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం వద్ద కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో పల్లకి సేవ, దీపోత్సవం కార్యక్రమాన్ని కన్నుల పండగ నిర్వహించారు. ఆలయ ఈవో రంగారావు రేనోవేషన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అత్యంత భక్తిశ్రద్ధలతో పల్లకి సేవ నిర్వహించారు భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారి సన్నిధిలో దీపాలు వెలిగించారు. మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మండల బీ ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సారా రామ గౌడ్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకి సేవలో పాల్గొన్నారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈవో రంగారావు జూనియర్ అసిస్టెంట్ వెంకట్ రెడ్డి రేనోవేషన్ కమిటీ శ్రీనివాస్ రెడ్డి సభ్యులు ఆలయ మాజీ కమిటీ చైర్మన్ లు మాజీ సర్పంచులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక ఎస్సై మురళి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తరలివచ్చిన ప్రముఖులు వివిధ గ్రామాల నుండి భారీగా తరలివచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# అయ్యప్ప స్వాముల శబరిమల మహా పాదయాత్ర

* బాన్సువాడ నుండి వందలాదిగా బయలుదేరిన అయ్యప్ప స్వాములు
* 1500 కి.మీ ల దూరం 42 రోజుల్లో..
* 16సం.లుగా నిర్విఘ్నంగా కొనసాగుతున్న మహా పాదయాత్ర
* వినయ్ గురు స్వామి ఆధ్వర్యంలో కాలినడకన శబరిమలకు





**అందోలు, నవంబర్05, (ప్రజాజ్యోతి):** వందలాది అయ్యప్ప స్వాములు బాన్సువాడ నుండి బయలుదేరి సువర్ణభూమి శబరిమలకు 'మహా పాదయాత్ర'గా బయలుదేరి బుధవారానికి 100 కి.మీ పాదయాత్ర ముగించుకుని అందోలుకు చేరుకున్నారు. అందోలు మండలం రాంసాన్ పల్లి వద్ద హైవేపై పాదయాత్రగా వెళుతున్న అయ్యప్ప స్వాములు ప్రజాజ్యోతి కి తారసపడితే స్వామి శరణం అంటూ స్వాములను పలకరించి యాత్ర విశేషాలు అడగగా వినయ్ గురుస్వామి, వసంత్ గురు స్వాములు శబరిమల మహా పాదయాత్ర గురించి స్పందిస్తూ.. మహా పాదయాత్ర ప్రారంభించి నేటికీ ఐదు రోజులు అవుతుందని, సుమారు 1500 కిలోమీటర్ల పాదయాత్ర 42 రోజుల్లో పూర్తి చేసుకునేలా ప్రణాళికలు వేసుకున్నామని తెలిపారు. రోజువారి పూజా కార్యక్రమంలో భాగంగా సంగుపేట వద్ద పూజా కార్యక్రమం అనంతరం సాయంత్రం చౌటకూర్ వరకు చేరుకుంటామని తెలిపారు. రాత్రి అక్కడే బస్సు చేసి ఉదయం అయ్యప్ప సన్నిధి చేరేందుకు తమ ప్రయాణం కొనసాగిస్తామన్నారు. గత 16 సంవత్సరాలుగా అయ్యప్ప స్వాములందరం కలిసి బాన్సువాడ నుండి శబరిమలకు మహాపాదయాత్రగా వెళుతున్నట్లు తెలిపారు. 100 మందితో మొదలైన మా యాత్రా మార్గంలో మరికొంతమంది స్వాములు ఈ మహా పాదయాత్ర లో చేరుతారని, మొత్తం 300 లకు పైగా స్వాములంతా కలిసి కాలినడకననే శబరిమలకు చేరుకుంటామన్నారు. రాంసాన్ పల్లి మీదుగా సంగుపేట వద్దకు చేరుకున్న స్వాములు పాదయాత్రలో స్వల్పవిరామం తీసుకొన్న తర్వాత నిత్య పూజలో భాగంగా లక్ష్మీ నరసింహా ఫంక్షన్ హాలులో పడిపూజ నిర్వహించారు. స్థానిక భక్తులు పెద్ద ఎత్తున పడిపూజలో పాల్గొన్నారు. స్వామి శరణం.. అయ్యప్ప శరణం.. శరణంపొన్ను అయ్యప్ప అంటూ అయ్యప్పను వేడుతూ గానాలాపన చేస్తూ స్వాములు పడిపూజ ఘనంగా చేశారు. అనంతరం బిక్ష ముగించుకుని స్వాములు అయ్యప్ప సన్నిధికై తమ ప్రయాణాన్ని కొనసాగించారు.

## రైతులు పండించిన వరి ధాన్యాన్ని
## చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

* పిఎసిఎస్ డైరెక్టర్ పెంటా గౌడ్



శివ్వంపేట, ప్రజాజ్యోతి నవంబర్ 05: శివ్వంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాలలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రంతోపాటు,ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల లో కూడా రైతులు పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని శివ్వంపేట పిఎసిఎస్ డైరెక్టర్ పెంట గౌడ్ బుధవారం నాడు మాట్లాడుతూ అన్నారు,మండల పరిధిలోని పోతుల బోగుడ గ్రామంలో మొదటిరోజు రెండు టన్నుల 480 క్వింటాళ్ల బియ్యం ప్రభుత్వ గోదాంకు పంపించడం జరిగిందని ఆయన తెలిపారు,అందులో భాగంగా బుధవారం నాడు పంపించిన వాహనంలో 620 బస్తాలు ఉన్నాయని ఆయన తెలిపారు, రైతులు రైతులు ఎటువంటి అధైర్య పడవద్దని రెండు మూడు రోజు ల్లో వారి ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేస్తామని ఆయన తెలిపారు, దళారులను నమ్మి మోసపోవద్దని పెంటా గౌడ్ సూచించారు,ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోని రైతులు ధాన్యాన్ని విక్రయించాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో కుమ్మరి నర్సింలు మంద చంద్రయ్య,కుమ్మరి శ్రీకాంత్,చాకలి రవి,గొల్ల నాగరాజు,తదితరులు ఉన్నారు తదితరులు ఉన్నారు,పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ఉన్న కొనుగోలు కేంద్రాలను ప్రతినిత్యం పర్యవేక్షిస్తున్నామని డైరెక్టర్ పెంటా గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు,

## తీరని శోకం

నారాయణఖేడ్, నవంబర్ 5, ప్రజాజ్యోతి: కర్ణాటకలోని బీదర్ జిల్లా హల్లిఖేడ్ వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నాలుగు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. ఈ దుర్ఘటనలో ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాల పాలై ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దైవ దర్శనానికి మంగళవారం గ్రామం నుంచి బయలుదేరిన వారు తిరుగు ప్రయాణంలో విగతజీవులై తిరిగి వచ్చారు. ఈ సంఘటనతో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ శోక సంద్రంలో మునిగింది. వివరాలు.. జగన్నాథ్‌పూర్‌కు చెందిన రాచప్ప (55), కాశీనాథ్(60), నవనాథ్(27), ప్రతాప్(35)తో పాటు మనూరు మండలం ఎల్గోయికి చెందిన నాగరాజు (37) మంగళవారం రాత్రి కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా గానుగాపూర్ పుణ్యక్షేత్రానికి కారులో బయలుదేరి వెళ్లారు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని గానుగాపూర్‌లో దర్శనం ముగించుకుని అర్ధరాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. బీదర్ జిల్లా హలిఖేడ్ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి వీరు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. దీంతో కాశీనాథ్, నవనాథ్, నాగరాజు అక్కడికక్కడే మృతిచెందగా, కొన ఊపిరితో ఉన్న రాచప్పను దవాఖానకు తరలిస్తున్న క్రమంలో మృతిచెందాడు. తీవ్రంగా గాయపడి విషమ పరిస్థితిలో ఉన్న ప్రతాప్‌ను బీదర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో జగన్నాథ్‌పూర్‌లో విషాద చాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబీకులతో పాటు బంధువులు, సన్నిహితుల రోదనలు మిన్నంటాయి. ముగ్గు రు మృతుల కడసారి చూపు కోసం వారి ఇండ్ల వద్ద బంధువులు, మిత్రులు విషణ్ణ వదనాలతో ఎదురు చూస్తున్న దృశ్యాలు కనిపించాయి.

## వర్షా లకు దెబ్బతిన్న బీటీ రోడ్లు



మద్దూరు, ప్రజాజ్యోతి, నవంబర్ 5: సిద్దిపేట జిల్లా ఉమ్మడి మద్దూరు మండలంలో ఇటీవల కురిసిన వర్షానికి రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. రోడ్లకు మరమ్మతులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దూరు మండలంలోని వల్లంపట్ల ఉప్పరోనిగడ్డ గ్రామాల మధ్య గతంలో రోడ్డు కోతకు గురైంది. సమీప రైతులు, గ్రామస్తులు తాత్కాలికంగా మరమ్మతులు చేసుకోగా,ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ధూళిమిట్ట మండలం కూటిగల్‌వల్లంపట్ల గ్రామాల మధ్య బీటీ రోడ్డు కోతకు గురైంది. చేర్యాల నుంచి నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు ఇదే రోడ్డుపై ప్రయాణం చేస్తుంటారు. వర్షాలకు ఈ రెండు రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డు సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ పనుల కోసం వెళ్లేందుకు రైతులు పాట్లు పడుతున్నా రు. దెబ్బతిన్న రోడ్డును మరమ్మతులు చేయించాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# ఏడుపాయల్లో కార్తీక శోభ..





* కిక్కిరిసిన భక్తజనం
* వైభవంగా లక్ష దీపారాధన
* రమణీయంగా సాగిన వనదుర్గమ్మ పల్లకి సేవ
* వనదుర్గామాత సన్నిధిలో పోటెత్తిన భక్తజనం






**మెదక్(ప్రజాజ్యోతి) నవంబర్ 05:** ఎటు చూసినా జనమే జనం.. అందరిలో భక్తి భావం.. ఆధ్యాత్మిక వాతావరణం.. మంజీరా "ఏడు" పాయలుగా చీలి ప్రవహించే ప్రాంతం.. జనమే జయుని సర్వయాగస్థలిగా వినతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. దేశంలోనే రెండో వనదుర్గామాత ఆలయంగా ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వన దుర్గామాత సన్నిధిలో బుధవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు వేకువ జామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించిన అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవారి సన్నిధికి చేరుకున్న భక్తులు ఆలయ పరిసరాల్లో దీపాలు వెలిగించి వేడుకున్నారు. లక్ష దీపారాధనతో మంజీరా పరిసరాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. "పండు వెన్నెల్లో.. ప్రమిదల కాంతుల్లో.. ఏడుపాయల క్షేత్రం విరాజిల్లింది. ఆడపడుచులు అధిక సంఖ్యలో పాల్గొని తమ పసుపు కుంకుమలు, సౌభాగ్యాలను కాపాడు తల్లీ అంటూ వనదుర్గమ్మకు వేడుకొని మంజీరా ఒడ్డున ప్రమిదలు వెలిగించారు. వనదుర్గమ్మ ప్రధాన ఆలయం ముందు మంజీరా ప్రవాహం ఉండడంతో రాజగోపురంలో ప్రతిష్ఠించిన ఉత్సవ విగ్రహం వద్దే భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్ జ్యోతి వెలిగించి లక్షదీపారాధన కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం ఆడపడుచులు రాజగోపురం వద్ద, నదీ పాయల ఒడ్డున ప్రమిదలు వెలిగించారు. మరి కొందరు మహిళలు ప్రమిదలను మంజీరా లో వదిలి వివిధ రకాల మొక్కులను మొక్కుకున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, హైదరాబాద్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూజల అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచే పల్లకిని సుందరంగా అలంకరించిన అనంతరం వనదుర్గా మాత ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి పల్లకి సేవ కార్యక్రమాన్ని రమణీయంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్,ప్రతాప్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నరేష్ గౌడ్,హరీష్,ప్రధాన అర్చకులు శంకర్ శర్మ, పార్థివ శర్మ, ఏడుపాయల మాజీ చైర్మన్ బాలగౌడ్, ఎస్సై శ్రీనివాస్ గౌడ్, ఆయా పార్టీల నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మొగులైతే.. గుబులు!

సిద్దిపేట, (**ప్రజాజ్యోతి**) నవంబర్ 4: అయ్యోదేవుడా మాకు ఇదేం గోస.. ఆరుగాలం కష్టించి పంట పండించే మా రైతుల మీద ఇంతగా పగబట్టావు. నోటి కాడికొచ్చిన బువ్వ నేల పాలైంది. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. వరుసగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం మొలకలు వచ్చాయి.ఆ మొలకలు ఏకంగా పొలంలో మళ్లీ నాటువేసే విధంగా వచ్చాయని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల గోసను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పేరుకు మాత్రమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. కానీ, నత్తనడకన కొనుగోళ్లు జరుగుతుండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిసి తాము నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. పంట చేతికి వచ్చి కోత కోసి ఆరబెట్టగానే అకాల వర్షం కురిసి ఆగంజేస్తున్నదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

*** లక్ష్యం కొండంత.. కొన్నది కొసరంత**

వానకాలం సీజన్కు సంబంధించి నవంబర్ నెల రాగానే 70శాతం వరకు ధాన్యం సేకరణ చేపట్టాల్సి ఉండగా, ఈసారి ఇప్పటి వరకు 20శాతం వడ్లు కూడా ప్రభుత్వం కొనలేదు. దీంతో రైతులు రోడ్డెక్కుతున్నారు. నిత్యం ఏదో ఒకచోట ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ధర్నాలు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో 5,03,800 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు కేవలం 16,982 మెట్రిక్ టన్నులు 3251 మంది రైతుల నుంచి కొన్నారు. ఇటీవల హుస్నాబాద్ ప్రాంతంలో భారీగా కురిసిన వర్షానికి ధాన్యం కొట్టుకుపోయింది. జిల్లాలో మొత్తం 1400 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు అధికారులు తెలిపారు. దీని విలువ రూ 36 కోట్లు కాగా, కేవలం రూ. 6 కోట్లు మాత్రమే రైతులకు చెల్లించారు. మెదక్ జిల్లాలో 3,20,500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, 26,391 మెట్రిక్ టన్నులు కొన్నారు. రూ.58.71 కోట్లకు ఇప్పటి వరకు రైతులకు రూ. 4.34 కోట్లు మాత్రమే చెల్లించారు. ధాన్యం కేంద్రానికి తెచ్చి 15 నుంచి 20 రోజులు అవుతున్నా కాంటా కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు ప్రకృతి కన్నెర జేయడం, ఇటు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రెంటికి చెడ్డ రేవడిలా రైతుల పరిస్థితి తయారైంది. అకాల వర్షాలు రైతులను ఆగంజేసి నష్టాలనే మిగిలిస్తున్నాయి.

*** కొనుగోలు కేంద్రాల్లో నిలువు దోపిడీ..**

నిర్వాహకులు, మిల్లర్లు, సంబంధిత అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పచ్చి ధాన్యం, తేమ, తాలు పేరిట కొర్రీలు పెట్టి క్వింటాల్కు నాలుగు కిలోల నుండి ఆరు కిలోల వరకు తరుగు తీస్తూ దోచుకుతింటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లికి చెందిన మహిళా రైతుకు సంబంధించి 200 బస్తాలకు 9 బస్తాలు తరుగు పేరిట కోత పెట్టారని బాధిత రైతు ఆరోపించారు. మిల్లర్లు, నిర్వాహకులు, అధికారులు కలిసి ప్రతి 200 బస్తాలకు 5 నుంచి 10 బస్తాల ధాన్యం కోత పెడుతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకోండి అని సమాధానం ఇస్తున్నారు. అలా అయితేనే తాము ధాన్యం దించుకుంటామని మిల్లర్లు చెబుతున్నారు.ముందుగా వీరు చేసుకున్న ఒప్పందం ప్రకారం కోతలు విధిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇతరత్రా ఖర్చులు భారీగానే అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కరువయ్యాయి. ధాన్యం మీద టార్పాలిన్లు కప్పుదామన్నా వాటిని అందుబాటులో ఉంచడం లేదు. మట్టి కల్లాలు కావడంతో వర్షం పడితే కొనుగోలు కేంద్రాల ఆవరణలు బురదమయం అవుతున్నాయి.